

ఒక సమస్యను అర్థం చేసుకోవాలంటే
ఆ సమస్యను సృష్టించిన వారిని
అర్థం చేసుకోవాలి.
అది ఎవరో కాదు. మీరే.


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA APR.09 - JULY 2009 Rs.2/- VOL. III ISSUE 3


## మా కర్తవ్యం ఏమిటి?

**ప్రశ్న:** మీరు స్వేచ్ఛను గురించే మాట్లాడుతున్నారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పాటు విధికర్తవ్యాల అవసరం కూడా వున్నది కదా? సమాజం ఎడల నా కర్తవ్యం, నా ఎడల నా కర్తవ్యం ఏమిటి?

**కృ:** స్వేచ్ఛను, విముక్తిని కర్తవ్యంతో పోల్చగలమా? కర్తవ్య పరాయణుడైన కొడుకుకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉంటాయా? సమాజం ఎడల నా విధి, నా కర్తవ్యం పాటిస్తుంటే నేను స్వేచ్ఛగా ఉండగలనా? కర్తవ్య పరాయణునిగా వుండి నిజమైన అర్థంలో విప్లవకారుడిని అవగలనా? ఆర్థిక విప్లవం అనే అర్థంలో కాదు. ఒక విధానాన్ని, రాజకీయ విధానం గాని, మత విధానం గాని నేను అనుసరిస్తున్నప్పుడు నాకు స్వేచ్ఛ అనేది అసలు ఉంటుందా? అప్పుడు నేను చేసేది కేవలం అనుకరణా, వట్టి కాపీయా? అసలు ఈ మొత్తం సమాజ నిర్మాణం అనుకరణే కాదా? కర్తవ్యం పాటించే కుమారునిగా ఉండటం, తండ్రి ఏది కోరితే అది చేస్తూ ఉండటం, సమాజం ఏది సబబు అని అంటుందో దానినే చేయడం– వీటన్నింటిలోనూ ఉన్నది అనుకరణత్వం అనే తెలుస్తున్నది కదూ. మా నాన్నగారు నేను న్యాయవాది నవుతే బాగుంటుంది అని కోరుకుంటారు. నేనున్యాయవాదిని అవడమే నా కర్తవ్యమా? ఫలానా మత సంస్థలో నేను చేరాలని మా నాన్నగారు అంటారు. ఆ ప్రకారంగా చేయడమే నా కర్తవ్యమా?

కర్తవ్యం, ప్రేమా రెండూ ఒకే చోట ఉంటాయా? ప్రేమ లేనప్పుడు మాత్రమే, స్వేచ్ఛ లేనప్పుడు మాత్రమే కర్తవ్యం అనే మాటకు ఎక్కడ లేని గొప్ప ప్రాముఖ్యం వచ్చేస్తుంది. అప్పుడు సంప్రదాయం స్థానాన్ని కర్తవ్యం ఆక్రమిస్తుంది. ఇటువంటి స్థితిలో మనం బ్రతుకుతున్నాం. అవునా? నేను 'నా కర్తవ్యం పాటించి తీరాలి. సమాజం ఎడల నా కర్తవ్యం ఏమిటి? నా ఎడల నా కర్తవ్యం ఏమిటి?సర్! సమాజం మిమ్మల్ని ఎన్నో– అనేకం చెయ్యమని నిలదీస్తుంది. మీరు విధేయత చూపాలి. మీరు అనుసరించాలి. కొన్ని కొన్ని క్రతువులు చేయాలి. ఫలానా పూజా కర్మకాండలు చేయాలి. నమ్మాలి. కొన్ని రకాలైన ఆలోచనలకు, కొన్ని కొన్ని నమ్మకాలకు మిమ్మల్ని నిబద్ధులను చేస్తుంది. మీరు నిజాన్ని కనిపెట్టాలనుకుంటున్నప్పుడు, సమాజానికి మీరు చేయవలసిన కర్తవ్యాన్ని కాదు– ఒక రకమైన నమూనాకు, విధానానికి కట్టుబడి ఉండాలని ప్రయత్నించడమూ కాదు– సత్యం ఏది అని కనిపెట్టాలని మీరు ప్రయత్నిస్తున్నప్పుడు, స్వేచ్ఛా స్వాతంత్ర్యం మీకు వుండి తీరాలి కదూ?

☞ 2

## విజ్ఞానం సేకరిస్తూ అజ్ఞానంలో

**(గత సంచిక తరువాయి)**

మీరు దీనికి చెప్పే పరిష్కారం ఏమిటి? దీన్ని జాగ్రత్తగా చూడండి సర్, స్వేచ్ఛగా అన్వేషించండి. పునర్జన్మ ఉందా, శాశ్వతమైన ఆత్మ ఉందా అని అడగకండి. అవి అన్నీ అరిగిపోయిన సంప్రదాయపు సమాధానాలు–నిజంగా దేనినీ సంతృప్తి పరచలేవు. నిజంగా మీకు పునర్జన్మపై నమ్మకం ఉంటే మీరు ఇప్పుడే అత్యున్నత స్థాయిలో జీవించి తీరాలి. ఎందుకంటే తరువాతి జన్మలో బాధపడతారు కాబట్టి. కానీ అలా మీరు జీవించరు. పునర్జన్మని నమ్ముతామంటారు కానీ పాత విధానంలోనే బ్రతుకుతూ ఉంటారు. కాబట్టి ఆ నమ్మకానికి అసలు విలువలేదు. మీరు ప్రస్తుతం ఎలా బతుకుతున్నారనేదే అసలు విషయం. రేపు ఏం జరగబోతోందనేది కాదు.

సరే, మనకందరికీ మృత్యువంటే భయం. మరణం అంటే ఏమిటో మీకు తెల్సు. భౌతిక శరీరం నశించడం, మీరు ప్రోది చేసుకుని ప్రియంగా దాచుకున్నదంతా అంతమవడం. ఈ సమస్యని మనసు ఎలా చూస్తుంది? సమస్యని వద్దని ఆపుతోందా? భయపడుతోందా? పోనీ గగనసీమలో దేవుడి పక్కన కూచోవడంలోనో, పునర్జన్మలోనో, ఇలాంటి ఊహలలో ఆశలు కల్పించుకుంటోందా? లేక ద్రష్ట లేకుండా ఈ సమస్య వంక చూడగలుగుతోందా? మీకు ఇదంతా అర్థమవుతున్నదా? చూచేవాడు లేకుండా గమనిస్తే అప్పుడు మరణం అనేది ఉందా? శరీరం యొక్క ప్రాణం పోవడం అనేది ఉంది. కానీ ఇప్పట్లాగా మన జీవితం అంతా అలుముకుని ఆక్రమించుకున్న మృత్యువు అనేది లేదు.

☞ 3

(*1వ పేజీ తరువాయి*) . . .

## మా కర్తవ్యం ఏమిటి?

స్వేచ్ఛగా ఉండటం అంటే ఏదో ఒక దాన్ని పక్కకు నెట్టేయడం కాదు. ప్రతిదాని ఎడల విరోధం పెంచుకోమనీ కాదు. స్వేచ్ఛ అంటే అది కాదు. స్వేచ్ఛలోని అంతర్గత అర్థం ఏమిటంటే నిరంతరం ఆలోచన ఎడల ఎరుకతో ఉండటం. అంటే ఏమిటంటే అప్పుడు కర్తవ్యంలో ఉన్న విషయమంతా తేటతెల్లమవుతుంది-అందులో నుండి విడుదల కలుగుతుంది. అంతేగాని ఏదో ఒక అంశాన్ని పక్కకు నెట్టేయడం వలన స్వేచ్ఛ లభించదు. ఏదో ఒక ఆలోచనను గాని, ఒక భావనను గాని నిరసించడమో, సమర్థించడమో చేయడము లేక మనల్ని దానితో మమేకం చేసుకోవడము వలన సంప్రదాయాలన్నింటినీ అర్థమూ చేసికోలేరు; వాటిలో ఉన్న పూర్తి విశిష్టత ఏమిటో పట్టుకొని గ్రహించనూలేరు.

ఈ సమాజం ఎడల, నా ఎడల నాకు గల కర్తవ్యం ఏమిటి అనే విచారణ ఆరంభిస్తాను. సరే, అది ఏమిటో ఎట్లా కనిపెట్టాలి? దీని చివర లక్ష్యం ఏమిటి? ఏ ప్రమాణంతో సరిచూడాలి? లేదూ, అసలు ఈ పదాల మీద ఎందుకు మనం ఆధార పడతామో అది కనిపెడదామా? అన్వేషిస్తున్న మనసు, శోధిస్తున్న, విచారణ చేస్తున్న మనసు ఎంత త్వరగా ఈ కర్తవ్యం అనే పదాన్ని పట్టుకొని అందులో చిక్కుకుని పోతుంది? వయసు పైబడుతున్న తండ్రి కొడుకుతో అంటాడు-"నా భారం వహించడం నీ కర్తవ్యం" అని. తండ్రి బాధ్యత తను వహించడమే తన కర్తవ్యం అని కొడుకూ భావిస్తాడు. ఈ కుమారుడికి వేరే ఏదో చేయాలని ఉంటుంది. అతడికి బహుశ చిత్రకారుడవాలని ఉండచ్చు. కాని తండ్రి భారం వహించడానికి, తననుతాను పోషించుకోవడానికి తగినంత సంపాదన అందులో ఉండదు. అందుకని డబ్బు సంపాదనే తన కర్తవ్యం అని అంటాడు; తను నిజంగా ఏం చేయాలని కోరుకుంటున్నాడో దానిని పక్కకు తోసేస్తాడు. ఇక జీవితాంతం సంపాదనలో చిక్కుకుపోతాడు. జీవితం చేదుగా మిగిలిపోతుంది. హృదయంలో మాధుర్యం ఎండిపోయి చేదెక్కుతుంది. తల్లి దండ్రులకుడబ్బు సంపాదించి ఇస్తూ ఉంటాడు. ఇదీ మన జీవితం. చేదు కషాయం లాంటి జీవితం జీవించి, ఆ చేదులోనే మరణిస్తాం.

మనలో ప్రేమలేదు కాబట్టి, మనలో స్వేచ్ఛలేదు కాబట్టి మన ఆలోచనలను అదుపు చేయడానికి, మన హృదయాలను, మనోభావాలను ఒక రకంగా మలుచుకోవడానికి మాటలను ఉపయోగిస్తాం. దానితో తృప్తి పడిపోతాం. నిజంగా చూస్తే విప్లవానికి దారి తీసేది ప్రేమ ఒక్కటే నేమో. అదొక్కటే మార్గం. అయితే మనలో చాలా మంది విప్లవాలంటే అభ్యతరం తెలుపుతారు. ఉపరితలంలో జరిగే ఆర్థిక విప్లవాలకే కాదు; అంతకంటె అత్యవసరమైన, ప్రగాఢమైన, అంతకంటె ఎంతో ప్రధానమైనదైన ఆలోచనల విప్లవానికి, సృజనాత్మక విప్లవానికి కూడా. ఇటువంటి విప్లవం మనకు అభ్యంతరకరం కాబట్టి పైపైన మాత్రం సంస్కరిస్తూ ఉంటాం. మాటలతో, బెదిరింపులతో, గొప్ప గొప్ప ఆశయాలతో ఇక్కడో అతుకు, అక్కడో అతుకు వేసి సరిచేయాలని చూస్తాం.

ఇది విన్నాక మీరేమంటారంటే నా ప్రశ్నకు మీరు సమాధానం ఇవ్వనే లేదూ అని. "సమాజం ఎడల, నా తండ్రి ఎడల నా ఎడల నాకున్న కర్తవ్యం ఏమిటి?" అని మీ ప్రశ్న. ఈ ప్రశ్నే తప్పు ప్రశ్న అని నేనంటున్నాను. ఈ ప్రశ్నను అడుగుతున్న మనసు స్వేచ్ఛలేని మనసు. తిరుగుబాటు లేని మనసు. అతి విధేయమై, అణగిపోయి లొంగిపోయిన మనసు, ప్రేమ లేని మనసు, చేదు నీడలు పరచుకొని పోయిన మనసు సమాజం ఎడల గాని, తన ఎడల తానే గాని కర్తవ్యం నిర్వహించగలుగుతుందా? అటువంటి మనసు ఒక నవ్య ప్రపంచాన్ని, ఒక నూతన నిర్మాణాన్నిసృష్టించకలుగుతుందా?

ఊరికే తలలాడించకండి. మీకు కావలసినది ఏమిటో తెలుసా? మీరు కోరేది తిరుగుబాటు కాదు. మనసులో విప్లవం రావాలని మీరు కోరుకోవడం లేదు. మీరు ఎట్లా పెరిగారో అదే రకంగా మీ పిల్లలను కూడా పెంచాలని మీరు అనుకుంటున్నారు. అదే రకంగా పిల్లలను నిబద్ధులను చేయాలనీ, అదే పద్ధతిలో వారు ఆలోచించాలనీ, పూజలు చేయాలి, మీరు నమ్మినవే వారు నమ్మాలీ అని కోరుకుంటున్నారు. అందుచేత, స్వయంగా వారంతట వారు కనిపెట్టడాన్ని మీరు ప్రోత్సహించరు. అందుచేత మీ నిబద్ధతలో పడి మిమ్మల్ని మీరు ఎట్లా ధ్వంసం చేసుకుంటున్నారో ఇతరులను కూడా అదే విధంగా ధ్వంసం చేయాలనుకుంటున్నారు. కాబట్టి సమస్య సమాజం ఎడల నా కర్తవ్యం ఏమిటి అనేది కాదు. ఈ ప్రేమను, ఈ స్వేచ్ఛాస్వతంత్ర్యాలను ఎట్లా కనిపెట్టాలి లేదా ఎట్లా జాగృతం చేయాలి అనేది. ఆ ప్రేమ అనేది ఒకసారి మేలుకొన్నదంటే మీలో ఆ కర్తవ్య పాలనే ఉండకపోవచ్చు.

ప్రేమ అన్నింటికంటె విప్లవాత్మకమైనది. అయితే మనసు ఈ ప్రేమనుతయారుచేయలేదు. ప్రేమను అలవరచుకోలేరు. అది ఉండాలి, అంతే. మీ పెరట్లో నారు పోసి పెంచే విషయం కాదు ప్రేమ. నిరంతరమైన విచారణతో, నిరంతరమైన అసంతృప్తితో తిరుగుబాటుతో ఉన్నప్పుడు ప్రేమ ఉనికిలోకి వస్తుంది. ఆధిపత్యాలను అనుసరించనప్పుడు, భయం లేనప్పుడు ప్రేమ ఉంటుంది. అంటే అర్థం-పొరబాట్లు చేయడం, ఆ పొరబాట్లలో నుండి సమాధానం పొందగలగడం అనే శక్తి సామర్థ్యం మీలో ఉన్నప్పుడు. భయం లేని మనసులో అల్పత్వం అనేది నిజంగానే ఉండదు. దానికి బాగా లోతులకు పోగలిగిన శక్తి ఉంటుంది. అటువంటి మనసు ప్రేమ అంటే ఏమిటో కనిపెడుతుంది. స్వేచ్ఛ-విముక్తి అంటే ఏమిటో కనిపెడుతుంది.

***(బొంబాయిలో ప్రసంగం నుండి; 8 మార్చి, 1953)***

## కొండవాగు, లేత వెన్నెల

చందమామ మబ్బుల్లో దాక్కున్నాడు. కానీ పర్వతాలు, నల్లని కొండలు స్పష్టంగా కనబడుతున్నాయి. వాటి చుట్టూ ఒక గొప్ప నిశ్చలమైన ప్రశాంతత కమ్ముకొని ఉన్నది. దట్టంగా పెరిగిన వృక్షాలతో నిండి ఉన్న కొండ కొస పైన ఒకే ఒక పెద్ద నక్షత్రం ఆకాశం నుంచి వేలాడుతున్నది. లోయలో నుండి వినవస్తున్న ధ్వని ఒక్కటే, కొండ వాగు చేసే చప్పుడు. రాళ్ళమీద నుండి వడివడిగా దొరులుతూ చేస్తున్న గలగల ధ్వని. సమస్త ప్రాణులూ నిద్రావశమై ఉన్నాయి. దూరంలో ఉన్న ఆ గ్రామం తప్ప. అయితే ఆ గ్రామంలోని శబ్దాలు ఇంత ఎత్తులకు చేరుకోవడం లేదు. కొంత సేపటికి కొండవాగు గలగల తరిగిపోయింది. అంటే వాగు ప్రవహిస్తూనే ఉన్నది కాని, ఆ ధ్వని లోయనంతటినీ నింపడం లేదు. గాలి బొత్తిగా లేదు. చెట్లన్నీ చలనం లేకుండా నిలబడి ఉన్నాయి. పేలవంగా ఉన్న జాబిల్లి అక్కడొకటీ ఇక్కడొకటీగా ఉన్నఇళ్ళకప్పల మీద లేత వెన్నెలను ప్రసరిస్తున్నాడు. ఎటు చూసినా అంతా నిశ్శబ్దం. లేత వెన్నెల పరుస్తున్న పలుచని నీడలు కూడా. భరించశక్యం గానంత అపారత్వం అతులిత తీక్షణతతో, అవిచ్ఛిన్నమైన తీవ్రతతో ఉన్నఅనుభూతి వాతావరణంలో నిండిపోయింది.

*(జె.కృష్ణమూర్తి నోట్ బుక్ నుండి)*

# అందాల అవనిపై శాంతియుత జీవనం

గట్టిగా ఆలోచించేవారికి ఎవరికైనా ఒక మనిషి ఇంకొక మనిషిని ఎందుకు చంపుతాడా అని అనిపించకుండా ఉండదు. దేవుడి పేరు చెప్పిగాని, శాంతి పేరుతో గాని, సిద్ధాంతాల కోసం గాని, దేశం కోసమో, రాజు కోసమో, రాణి కోసమోగాని - దేని కొరకైనా సరే. మనిషి ఈ భూమి మీద జీవిస్తున్నాడు. మెల్లమెల్లగా భూమి విధ్వంసం పాలవుతున్నది. మనిషి మరొక మనిషితో శాంతి యుతంగా ఎందుకు జీవించలేడు? ఈ ప్రత్యేకమైన దేశ దేశాలు ఎందుకున్నాయి? నిజంగా చూస్తే ఇవి ఒక రకమైన ఆటవిక తెగలే. మతాలు కూడా ఒక దానితో ఒకటి యుద్ధం చేసుకుంటున్నాయి. సిద్ధాంతవాదాలు,అవి అమెరికావి అయినా రష్యావి మరొకరివీ అయినా అవీ పరస్పరం కలహించుకుంటున్నాయి. ఘర్షణ పడుతున్నాయి. అనేక శతాబ్దాలు భూమి మీద జీవించాక కూడా మనిషి ఈ అందాల అవనిపై శాంతితో ఎందుకు జీవించలేక పోతున్నాడు? ఎన్నోసార్లు ఈ ప్రశ్న మళ్లీ మళ్లీ వేసుకుంటున్నారు. అందుకోసమే ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ భవిష్యత్తుఏమిటి? దీనికి నలభై ఏళ్ళు పూర్తయాక ఏం జరగబోతున్నది? అందుచేత, మనం, మానవులం, ఒక సమాజంలో గానీ, ఒక కుటుంబంలో గానీ ఒకరితో ఒకరం శాంతి యుతంగా జీవించగలమా అనే ప్రశ్నను మనకు మనమే వేసుకోవడం మంచిది.

*(ఐక్యరాజ్య సమితిలో ప్రసంగం, పీస్ ఆన్ ఎర్త్ కమిటీ, 1985)*

(1వ పేజీ తరువాయి) . . .

# విజ్ఞానం సేకరిస్తూ అజ్ఞానంలో

భయం ఎలా నిర్మితమవుతుందో గమనించి దీనిని కనిపెట్టండి. మందూమాకుల ద్వారా కాదు. అసలు భయం అంటే ఏమిటి? ఈ గమనించడం ఏమిటి అన్న విషయం కనుగొనండి. చేతనలోనూ, అంత:చేతనలోనూ ఉన్న భయాలూ, వద్దని ఆపుతున్న ఈ నిరోధం వీటన్నిటిపట్లా ఎఱుక గలిగి ఉండండి. మనకి ఆ విషయాలన్నింటినీ వివరంగా చెప్పుకోవడానికి సమయం లేదు.

మళ్ళీ మన మూలప్రశ్నకి వద్దాం. అజ్ఞానం అంటే ఏమిటి? ఈ మనసు, మెదడు, వీటి నిర్మితి, వీటి మొత్తం కదలిక గురించి అవగాహన, గమనిక, ఎఱుక లేకపోవడమే అజ్ఞానం. అజ్ఞానం యొక్క నైజం, తత్త్వం ఇదే. వీటి గురించి తెలియనితనమే. పుస్తకాలనించీ ప్రొఫెసర్లనించీ నేర్చుకొని పరీక్షల్లో ఉత్తీర్ణులై డిగ్రీలూ, ఉద్యోగాలూ సంపాదించడమొక్కటే కాదు ఉన్నది. ఈ అస్థిమిత ప్రపంచంలో అది అవసరమే. కానీ వాటిల్లో పడి ఈ లోపల జరిగే అద్భుత అసాధారణ చలనశీలత్వాన్నీ, దాని అందాన్నీ, కోమలత్వాన్నీ, వేగాన్నీ చూడలేక పోవడం, దాని పట్ల ఎఱుక లేకపోవడం-ఇది అజ్ఞానమూ, అవివేకమే కాదు వినాశకారి కూడా.

మీరు ఇప్పుడు ఏమన్నా ప్రశ్నలగడ వచ్చునేమో, ఇప్పటికే మీరు అలసి పోకుండా ఉన్నట్టయితే. అయితే అడిగే ముందు ఎందుకని ఆ ప్రశ్న వేస్తున్నారో కనిపెట్టండి. ఏ కారణం వల్ల, ఎందుకు ఆ ప్రశ్న అడుగుతున్నారో మీరు తెలుసుకోగలిగితే ఆ ప్రశ్నకి సమాధానం మీకు మీరే కనిపెట్టగలరు. మనం ప్రశ్నిస్తాం. వేరే వాళ్ళు జవాబు చెపితే దానికి అంగీకరించడమో, నిరాకరించడమో చేస్తాం. అంటే నిజంగా మనం ఏ ప్రశ్నా అడగడం లేదన్నమాట. మన అభిప్రాయాన్ని ప్రశ్న ద్వారా వ్యక్తం చేస్తున్నామన్న మాట. అభిప్రాయం సత్యం కాదు.

తార్కికంగా, మీమాంసికంగా చూసే అభిప్రాయం సత్యాన్ని చూపలేదు. ఈ ప్రశ్న వేయడం అనే దానిలోకి లోతుగా వెళ్ళి చూడడం అనేది ఒక అపూర్వమైన విషయమే. ఎందుకని ప్రశ్నిస్తున్నాం? ఎవరు దీనికి జవాబివ్వబో తున్నారు? సమాధానం విన్నపుడు దానిని దానిగా అర్థంచేసుకునే శక్తి మీకుందా? లేక మీరనుకున్నట్టుగా, మీ ఇష్టానిష్టాలకు అనుగుణంగా ఉండే జవాబుని ఆశిస్తున్నారా? మీరు ఏ బాదరబందీలు లేకుండా స్వేచ్ఛగా వింటున్నారా? లేక విన్న సమాధానాన్ని మీకున్న తృష్ణలూ, కోరికలకి అనుకూలంగా మలచుకొని అర్థం చేసుకుంటున్నారా? మీరు స్వేచ్ఛగా ప్రశ్నించి స్వేచ్ఛగా వింటే, అపుడు ఆ సమాధానంలో ఒక సౌందర్యముంటుంది. మరి మీరు ఏమన్నా ప్రశ్నలడగదల్చుకొన్నారా?

**ప్ర:** "ఆత్మ" అనేది ఒకటి ఉన్నదా?

**కృ:** మీరడిగేది "ఎస్ ఓ యు ఎల్" గురించే కదా? "ఎస్ ఒ ఎల్ ఇ" కాదు కదా? (నవ్వులు) శరీరం, మెదడు, ఆలోచన-వీటన్నింటినించీ వేరుగా ఉన్నదీ, కాలానికి లోబడనిదీ, కాలరహితమైనది ఏదైనా ఉందా? మనం ఆత్మ అనేదాన్ని గురింరి సాధారణంగా అనుకునేదదే కదా? అంతేనా? మనం ఆ పదానికి ఉన్న అర్థాన్నీ, దాని వెనుక ఉన్న సత్యాన్నీ అన్వేషిద్దాం. మీకు ఆత్మ అనేది ఉందని ఎలా తెసుసు? మీకు ఎవరో చెప్పారు. అంతే కదా? ఆత్మ అనే నమ్మకానికి మీరు లోబడి, బద్దులై ఉన్నారు. కమ్యూనిస్టులం అనుకునేవాళ్ళు ఆత్మ లేదు అనే భావనకి కట్టుబడి బందీలయ్యారు. అలానే మీరు ఆత్మ, అత్యున్నతాత్మ లాంటి వాటిల్లో నమ్మకానికి నిబద్దులై బందీలయ్యారు. అలానే మీరు ఆత్మ, అత్యున్నతాత్మ లాంటి వాటిల్లో నమ్మకానికి నిబద్ధులై బందీలయ్యారు. ఈ విషయంలోని అసలు సత్యం కనుగొందాం. మనలో శాశ్వతమైనది ఏదైనా ఉందా? శాశ్వతమైనది, ఎప్పుడూ నిలచి ఉండేది అంటే కాలరహితమైనదన్నమాట. దీనిని ఆలోచన పట్టుకోలేదు. ఎందుకంటే ఆలోచనే కాలం. ఆలోచనే గతం. ఆత్మ అనేది ఒకటి ఉందని మీరు ఆలోచన చేస్తే దాంతోనే మీరు ఆత్మని కాలపు ఆవరణలోకి తెచ్చేసారన్నమాట. ఆలోచన దానిని కాలక్షేత్రంలోకి తేగలిగిదంటే, ఈ "ఆత్మ" ఆలోచనలో భాగమేనన్నమాట. అంటే శాశ్వతం కాదన్నమాట. ఈ"శాశ్వతమైన ఆత్మ' అనేదాన్ని ఒక భావనగా తెచ్చుకొని ఆలోచన దానిలో రక్షణ పొందుతుంది.

అనుభవమై, అలవాటై, సంప్రదాయమై, దేనికో కట్టుబడి నిబద్ధమై మళ్ళీ మళ్ళీ వచ్చే ఈ ఆలోచన వల్ల ప్రోది చేయబడనిదీ, శాశ్వతమైనదీ ఏదైనా ఉందా? ఇదీ మన ప్రశ్న. కాలానికి, ఆలోచన ల కొలతలకీ అందనిది, వాటికి ఆవల ఉండేది ఏదైనా ఉందా? దానిని కనుగొనాలంటే - కనుగొనడం అంటే నమ్మడమూ కాదు, శంకరుడో, బుద్ధుడో చెప్పిందాన్ని వల్లించడమూ కాదు -నిజంగా దానిని కనిపెట్టాలంటే ద్రష్టగా ఉండే ఆలోచన పూర్తిగా నిశ్శబ్దమై పోవాలి. అపుడు కాలభావన లేకుండా చూడగలిగితే సమస్త విశ్వం మీ కళ్ళలోకి, హృదయంలోకీ వస్తుంది.

**ప్ర:** జీవించి ఉన్నంత కాలమూ ఈ నేను అనేది ఎన్నో సాధించి కూడబెట్టుకొని సొంతం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఈ ప్రక్రియలో అది సుఖాల్నీ, దు:ఖాల్నీ మార్చి మార్చి అనుభవిస్తుంది. చనిపోయాక, ఈ నేను తను కొనసాగుదామనుకున్నంత కాలమూ-ఎంత కాలమైనా సరేఉంటుందా? ఈ రూపంలోనో, వేరే రూపంలోనో?

**కృ:** జాగ్రత్తగా వినండి. ఈ ప్రశ్న అడిగింది ఒక విద్యార్థి. ఈ ప్రశ్న 'నేను' అనే దాని గురించి, మరణం గురించి. జీవించడం గురించి కాదు. నిజమైన ఆనందంతో, ఆహ్లాదంతో సృజనాత్మకంగా, నిత్య నూతనంగా ఎలా బ్రతకాలి అని కాదు. హిందువులు సాధారణంగా అడిగే ప్రశ్న ఇది. అమెరికా, ఐరోపాలలో

ఇలాంటి ప్రశ్నలడగరు. ఈ దేశంలో మనమందరం 'పరం"లో, "మతం" లో ఆసక్తి ఉన్న వాళ్ళం అనుకుంటూ ఉంటాం కాబట్టి ఇలాంటి ప్రశ్నలడుగుతాం. అంటే మతాన్ని మనం జీవితంనించివిడదీశామన్న మాట. ఈయన ప్రశ్నిస్తున్నదేమంటే-ఈ 'నేను' అనేది ఏమిటి? శరీరం మరణిస్తే ఇది వేరే రూపంలో ఉంటుందా? ఇది కొనసాగుతుందా?

ప్రశ్నలో ధ్వనిస్తున్నదీ, కనబడుతున్నదీ ఏమంటే ఈ 'నేను' అనేది ఒక శాశ్వతమైనదని. నాశనం లేనిదనీను. శాశ్వతమైనదీ, నశించనిదీ ఈ జీవితంలో ఏమైనా ఉందా? నేను అనేది అలా శాశ్వతంగా ఉండాలని మీరు కోరుకోవచ్చు. కానీ అది శాశ్వతమా? దయచేసి పరిశోధించండి. ఈ 'నేను' అనేది ఏమిటి? ఇది జ్ఞాపకాల ముద్ద. కదా? నా అనుభవాలూ, నా ఇల్లూ, సామాన్లూ, నా భార్యా పిల్లలూ, నా డబ్బూ, వృత్తీ, నాకున్న నైపుణ్యం-వీటన్నంటితో తాదాత్మ్యం చెందడం- ఇదే కదా 'నేను' అంటే? కోపం, ఈర్ష్యాసూయలూ, అన్నింటినీ సొంతం చేసుకోవాలనుకోవడం, ఆక్రమించుకోవడం, అధికారం చెలాయించడం, ఈ లక్షణాలన్నీ ఉన్న ఈ 'నేను' శాశ్వతమా? ఇదంతా ఒక జ్ఞాపకం-ఇది శాశ్వతమా? ఇది శాశ్వతమైతే బాగుండుననిపిస్తుంది. ఎందుకంటే శరీరం ఉన్నా లేకపోయినా ఈ 'నేను' అనేది కొనసాగుతుందన్న ఆలోచనలో భద్రత, రక్షణ ఉన్నాయి. కనుకనే ఈ భావనని గట్టిగా పట్టుకుంటాం మనం. మీరు దీనిని నేను అని పిలవకుండా 'ఆత్మ' లాంటి వేరే పేర్లతో వ్యవహరించవచ్చు. ఎలా పిలిచినా దాని వెనుక ఉన్నది ఇదే. ఈ అశాశ్వతమైన ప్రపంచంలో ఏదో శాశ్వతమైనది నాకు ఉండాలన్న భయం నించి పుట్టినదే ఇదంతా. స్వేచ్ఛా దృష్టితో దీన్ని పరికిస్తే నాశనం లేని 'నేను' అనేదేమీ లేదని మనం చూడచ్చు. అయితే మరి ఏదీ శాశ్వతం కానప్పుడు ఏ మంచి నైనా ఎందుకు పెంపొందించుకోవాలి? దేన్నైనా చేయడం ఎందుకు? అసలు ఈ అనుభవమంతా దేనికి? ఇదంతా ఏమిటి?

దీని సత్యం కనుగొనాలంటే, సర్, మీరు ఆలోచన అనే దానికి సంబంధించిన మొత్తం ప్రశ్నలన్నింటిలోకి వెళ్ళాలి. ఆలోచించడమంటే ఏమిటి? నేను అంటే నా అనుభవాలూ, సుఖాలూ, భయాలూ, వస్తువులూ-వీటిన్నటితో మమేకం చెందిన నా ఆలోచన-దీనికి శాశ్వతత్వం ఉందా? లేదన్న విషయం స్పష్టంగానేఉంది. జీవగమనమూ, దాని యొక్క చలనమూ -దీన్నొక్కదానినే శాశ్వతం అని పిలవగలం. చలనం, కదలిక-అంటే మీదీ నాదీ కాదు-కేవలం ఆ 'చలనం'-దాని సౌందర్యం. ఇదే శాశ్వతం, ద్రష్ట లేకుండా ఆ గమనంతో పాటే వెళ్ళడం అంటేనే పూర్తిగా విభిన్నమయిన ఒక క్షేత్రాన్ని దర్శించడం.

మీకు తెలుసా సర్, ధ్యానం అనేది జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయాలలో ఒకటి. ధ్యానమనేది అత్యద్భుత విషయం. ధ్యానం అంటే ఏమిటో తెలుసుకోవాలంటే ముందు ధ్యానం చేసేవాణ్ణి అర్థంచేసుకోవాలి. ధ్యానం అంటే ధ్యానించేవాడే. ఇంకేమీ కాదు. ధ్యానిని అవగాహన చేసుకుంటే జీవితపు ఆద్యంతాలను అవగతం చేసుకున్నట్టే.

***(బొంబాయి విశ్వవిద్యాలయంలో చేసిన మొదటి ప్రసంగం - 1969)***

# క్రమశిక్షణ అంటే చక్కగా నేర్చుకోవడం

**ఒక శ్రోత ప్రశ్న:** నేను చాలా నిర్బంధాల మధ్య, కఠినమైన క్రమశిక్షణ గల వాతావరణంలో పెరిగాను. బాహ్య ప్రవర్తనలోనే కాకుండా నా లోపలి ఆలోచనలను, అభిలాషలను అదుపుచేసుకోవాలని, కొన్ని కొన్ని పనులు క్రమం తప్పకుండా చేయాలనీ కూడా నాకు నేర్పించారు. దీని ఫలితంగా నా చుట్టూ ఒక కంచె కట్టి ఉన్నట్లుగా అనిపిస్తున్నది. నేను ఏ పనీ సులభంగా, స్వేచ్ఛగా, సంతోషంగా చేయలేకపోతున్నాను. నా చుట్టూ ఉన్న విశృంఖల సమాజంలో ఏం జరుగుతున్నదో చూస్తున్నప్పుడు ఆ చిదరవందర, ఆ మురికి, నిర్లక్ష్యవైఖరి, బొత్తిగా సభ్యత లేని ప్రవర్తన- ఇవన్నీ చూసి హడలి పోతుంటాను. అయితే నాలో నాకే నేనూ ఇవన్నీ చేస్తే బాగుండు అనే ఒక రహస్యమైన కోరిక కూడా కలుగుతూ ఉంటుంది. కానీ క్రమ శిక్షణవలన కొన్ని విలువలు పాతుకొనిపోతాయి. క్రమశిక్షణ కారణంగా ఒక రకమైన నిస్పృహ, వక్రతనమూ ఏర్పడినా క్రమశిక్షణ యొక్క అవసరాన్ని నిజానికి కాదనలేము. ఉదాహరణకి, కుదురుగా కూర్చోవడం, సక్రమంగా తినడం, జాగ్రత్తగా మాట్లాడటం వంటివి. క్రమశిక్షణ లేకపోతే సంగీత సాహిత్యాల్లోని, చిత్రకళలోని అందచందాలను గ్రహించలేము. సభ్యత గల ప్రవర్తన, సుశిక్షణల వలన దైనందిన సామాజిక వ్యాపార కార్యకలాపాలలో అనేక సున్నితమైన సూక్ష్మాంశాలు వెల్లడి అవుతుంటాయి. ఈ ఆధునిక తరాన్ని పరిశీలించి చూస్తే అనిపిస్తుంది - యువత లోని సౌందర్యం ఇప్పుడు వారి వద్ద ఉన్నది.అయితే క్రమశిక్షణ కనుక లేకుంటే త్వరలోనే అది వాడి మాయమవుతుంది. వీరంతా చిరాకు పుట్టించే వృద్ధ స్త్రీ పురుషులుగా మారిపోతారు. ఇదంతా చాలా విషాదకరం. ఒక యువకుడిని తీసుకోండి. ఉత్సాహంగా, కారిన్యత అనేది లేకుండా, తేటగా చూసే చూపులతో, చక్కని చిరునవ్వుతో ఎంతో అందంగా కనబడతాడు. కొన్ని సంవత్సరాలు పోయాక మళ్ళీ అతడు కనిపిస్తే అతడిని గుర్తుపట్టలేం. అశ్రద్ధ, మొండితనం, నిర్లక్ష్యం కనిపిస్తుంటాయి. గొప్ప మాటల్ని కొన్ని పట్టుకొని వల్లిస్తూ ఉండటం, చాలా గౌరవనీయుడిలా కనబడటం, కరుకుగా, వికారంగా, మూసుకొని పోయిన మనసుతో, అతిగా మనోద్వేగాలు ప్రదర్శిస్తూ ఉంటాడు. క్రమశిక్షణ కనుక ఉంటే ఇలా అవకుండా తప్పక రక్షించి ఉండేది. నా అస్తిత్వాన్నే ఎగరగొట్టేసినటువంటి క్రమశిక్షణలో పెరిగిన నేను ఈ విశృంఖల సమాజానికీ, నేను పెరిగిన సభ్యతకూ నడుమ మధ్యేమార్గం ఎక్కడ ఉన్నదా అని తరచు విచారిస్తూ ఉంటాను. క్రమశిక్షణలో ఉండే అణచివేత, వక్రత్వం అనేవి లేకుండా మన లోపలే మనల్ని మనం గట్టి క్రమశిక్షణలో పెట్టుకుంటూ బ్రతికే మార్గం అంటూ ఒకటి లేదా?

**కృష్ణమూర్తి:** క్రమశిక్షణ అంటే నేర్చుకోవడం. అంతే గాని తల ఒంచి అనుసరించడం కాదు. అణచి వేసుకోవడం కాదు. మన పై నున్న ఆధిపత్యం ఏది సర్వోత్తమం అంటుందో ఆ విధానాన్ని అనుకరించడం కాదు. ఇది చాలా జటిలమైన అంశం. ఎందుకంటే ఇందులో చాలా సంగతులు ముడిపడిపోయి ఉన్నాయి. నేర్చుకోవడం, నిరాడంబరంగా ఉండటం, స్వేచ్ఛగా ఉండటం, సున్నితంగా ఉండటం, ప్రేమలో ఉన్న సౌందర్యాన్ని చూడటం. నేర్చుకోవడంలో పోగుచేసి నిలవచేసుకోవడం ఉండదు. జ్ఞానార్జన వేరు, నేర్చుకోవడం వేరు. జ్ఞానం అంటే పోగుచేసుకోవడము, అభిప్రాయాలు, సూత్రాలు. కానీ నేర్చుకోడం ఒక నిరంతరమైన కదలిక. ఒక కేంద్రస్థానం లేకుండా సాగుతూ పోయే ప్రవాహం. దీనికి ఆరంభం ఉండదు. అంతం ఉండదు. తనను గురించి తాను నేర్చుకోవడంలో పోగుచేసుకోవడం, నిలువచేయడం ఉండకూడదు. అట్లా చేస్తే కనుక అది తనను గురించి తాను నేర్చుకోవడం అవదు. అది కేవలం తను గురించి తనకి ఉన్న సమాచార జ్ఞానానికి మరికొంత జోడించడమే అవుతుంది. స్వేచ్ఛతో చూడటం, గ్రహించడమూయే నేర్చుకోవడం. మీకు కనుక స్వేచ్ఛ లేకపోతే చూడలేరు. అందుచేత ఈ నేర్చుకోవడం లోనే క్రమశిక్షణ ఉన్నది. ముందుగా మిమ్మల్ని క్రమశిక్షణలో పెట్టుకోవడం, ఆ పైన

నేర్చుకోవడమూ కాదు. అందుచేత క్రమశిక్షణే స్వేచ్ఛ, విముక్తి. ఇక్కడ తల ఒంచి అనుసరించడం, అదుపు ఆజ్ఞలు నిరాకరించబడతాయి. అదుపు చేయడం అంటేనే ఒక విధానాన్ని అనుకరించడం. ఒక పద్ధతి, ఒక విధానము అంటే అణచివేత 'ఉన్నది' ని అణచివేయడము. ఏది మంచి, ఏది చెడు అని చెప్పే ఒక సూత్రం ఉన్నప్పుడు 'ఉన్నది' ని గురించి నేర్చుకోవడమే జరగదు. 'ఉన్నది' ని గురించి నేర్చుకోవడమే 'ఉన్నది' నుంచి విముక్తి చెందడం. అందుచేత నేర్చుకోవడం అనేది అత్యున్నతమైన క్రమశిక్షణ. నేర్చుకోవడానికి తెలివితేటలు,సున్నితత్వం అత్యావశ్యకం.

మతాచార్యులు, సన్యాసులు అవలంబించే నిరాడంబరతలో నిష్ఠ-కాఠిన్యం ఉంటుంది. వాళ్ళు తమ అభిలాషలను, తృష్ణలను కొన్నింటిని వదులుకుంటారు. అయితే వారి సంప్రదాయం అనుమతించిన కొన్నింటిని మాత్రం వదులుకోరు. కఠోరమైన హింసకు దిగ్విజయరూపమే ఈ పవిత్ర పురుషుడు, మహాత్ముడు. సాధారణంగా నిరాడంబరత అంటే స్వసుఖపరిత్యాగం అనీ, ఆ రెండూ ఒకటే అనీ అనుకుంటారు. చాలామంది. అయితే ఈ స్వసుఖపరిత్యాగాన్ని అమానుషమైన క్రమశిక్షణ, కఠిన సాధన, అనుసరణల ద్వారా సాధిస్తారు. క్రీడాకారుల్లాగే ఈ మహాపురుషులు కూడా పోటీలు పడి ఇంతకు మునుపువారు సాధించిన వాటిని (రికార్డును) అధిగమించి పోవాలని ప్రయత్నిస్తుంటారు. ఇందులో ఉన్న అసత్యాన్ని చూడటమే నిరాడంబరతను తీసుకొస్తుంది. ఈ మహాత్ములు, మహాపురుషులు అంతా అవివేకులు, అల్పులు. ఇది చూడగలగడమే తెలివి. ఇటువంటి తెలివి గాఢమైన లోతులను తాకి మళ్ళీ పైచివరలకు అంటే వ్యతిరేక దిశలో అంతే అతిగా వెళ్ళిపోవడం చేయదు. తెలివి అంటే ఏమిటంటే, అర్థంచేసుకోగలసున్నితత్వం. అందుచేత ఈ తెలివి పరస్పర వ్యతిరేక దిశల్లో ఉండే ఆ రెండు కొసల జోలికీ పోదు. అయితే, బిడియంతో, బహుజాగ్రత్తగా ఉండిపోయే సగటు తనపు లక్షణం కూడా కాదు ఇది. ఇదంతా స్పష్టంగా గ్రహించగలగడమే దీనిని గురించి నేర్చుకోవడం అనమాట. దీనిని గురించి నేర్చుకోవాలంటే అభిప్రాయాల నుండి, పక్షపాతాల నుండి అన్నింటి నుండి విడుదల చెందాలి. ఇటువంటి అభిప్రాయాలు, తీర్మానాలు, పక్షపాతాలు ఒక కేంద్రస్థానం-స్వీయం నుండి చేసే పరిశీలన. ఆ కేంద్రస్థానమే సంకల్పిస్తూ ఆదేశ నిర్దేశాలు చేస్తూంటుంది.

**ప్రశ్నిస్తున్నవారు:** మీరంటున్నది మామూలుగా చెప్పాలంటే-సక్రమంగా చూడటానికి నిష్పక్షపాతంగా తటస్థంగా ఉండాలి అని. అంతే కదూ?

**కృ:** అవును. అయితే నిష్పక్షపాతంగా అనే మాట సరిపోదు. ఇప్పుడు మనం మాట్లాడు తున్నది సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కి ఉండే నిష్కర్ష అయిన నిష్పక్షపాతం గురించి కాదు. ఒక మనోస్థితిని గురించి. ఆ స్థితిలో కారుణ్యం, సున్నితతత్వం, ప్రగాఢత ఉంటాయి. మేము ముందే చెప్పినట్లుగా క్రమశిక్షణ అంటే నేర్చుకోవడం. నిరాడంబరతను గురించి నేర్చుకోవడంలో మనలను గాని ఇతరులను గాని హింసించడం ఉండదు. సాధారణంగా అందరూ అనుకునే అర్థంలో క్రమశిక్షణ అంటే మాత్రం ఇది చేయాలి అనే సంకల్పంతో చేసే పని. అదే హింస.

ప్రపంచమంతటా అందరూ అనుకునేది ఏమిటంటే దీర్ఘకాలికంగా కొనసాగే క్రమశిక్షణ ద్వారానే విముక్తి అనే ఫలం లభిస్తుందని. స్పష్టంగా చూడగలగడంలోనే దాని క్రమశిక్షణ ఉంటుంది. స్పష్టతతో చూడాలంటే స్వేచ్ఛ ఉండి తీరాలి. దృష్టిని అదుపు ఆజ్ఞల్లో పెట్టకూడదు కాబట్టి విముక్తి లభించేది క్రమశిక్షణ పూర్తయాక కాదు. విముక్తి అంటే ఏమిటో అవగాహన చేసుకోవడంలోనే దాని క్రమశిక్షణ ఉంటుంది. అవి రెండూ కలిసే ఉంటాయి తప్ప విడివిడిగా ఉండవు. వాటిని రెండుగా విడగొడితే అప్పుడు సంఘర్షణ జనిస్తుంది. ఈ సంఘర్షణను పోగొట్టడానికి సంకల్పం పనిచేయడం ఆరంభమవుతుంది. దీని వలన ఇంకా ఎక్కువ సంఘర్షణ పుట్టి పెరుగుతుంది. ఇదంతా అంతులేని గొలుసులా సాగిపోతుంటుంది. అందుచేత విముక్తి మొదట్లోనే ఉంటుంది. తప్ప ఎక్కడో అంతంలో కాదు. ఆరంభమే అంతం. దీనంతటిని గురించి నేర్చుకోవడంలోనే దాని క్రమశిక్షణ ఉంటుంది. నేర్చుకోవాలంటే సున్నితత్వం తప్పక కావాలి. మీ ఎడల మీరు, మీ పరిసరాల ఎడల, మీ బాంధవ్యాలలో మీరు సున్నితంగా లేకపోతే, మీ చుట్టుపక్కల జరుగుతున్నదాని ఎడల-అది వంటిల్లు అవచ్చు, విశాల లోకం అవచ్చు-సున్నితంగా లేకపోతే అప్పుడు మిమ్మల్ని మీరు ఎంత క్రమశిక్షణలో పెట్టుకున్నా సున్నితత్వాన్ని ఇంకా ఇంకా కోల్పోతూ, మొటుగా, ఇంకా స్వీయకేంద్రితులుగా తయారవుతారు. ఇది అనేకానేక సమస్యలను పెంచిపోషిస్తుంది. నేర్చుకోవడం అంటే మీ ఎడల, మీకు బాహ్యంగా ఉన్న ప్రపంచం ఎడల సున్నిత మనస్కులై ఉండటం. ఎందుకంటే బయటి ప్రపంచమే మీరు. మీ ఎడల మీరు సున్నితత్వంతో ఉంటే ప్రపంచం ఎడల కూడా సున్నితత్వంతో ఉండి తీరుతారు. ఈ సున్నితతత్వమే అత్యున్నతమైన తెలివి అని చెప్పచ్చు. ఇది ప్రత్యేక నిపుణునికి అంటే ఒక వైద్యునికో, విజ్ఞానశాస్త్రజ్ఞుడికో, ఒక కళాకారునికో ఉండేటువంటి సున్నితత్వం కాదు. ఇటువంటి ఛిన్నాభిన్నత వలన సున్నితశీలం కలగదు.

సున్నితత్వం లేనప్పుడు ఎవరైనా ఎట్లా ప్రేమించగలుగుతారు? అతిగా మనోద్రేకాలు, భావానురక్తి వంటివి సున్నిత శీలత కావు. అవన్నీ పరమ క్రూరమైన సంగతులు. యుద్ధాలకు దారి తీసేవి ఇవే. అందుచేత క్రమశిక్షణ అంటే శిక్షణ మైదానంలో కాని, మీ లోపల అంతరంగంలో కాని సేనాధిపతి చేయించే కవాతు కాదు. అవన్నీ సంకల్పం-పట్టుదల చేసే పని. రోజు పొడుగునా, నిద్రపోతున్నప్పుడూ కూడా నేర్చుకుంటూ ఉండటంలో ఒక అద్భుతమైన క్రమశిక్షణ ఉన్నది. అది వసంత ఋతువులో చిగిర్చిన లేత ఆకు అంతమృదువుగా ఉంటుంది. కాంతి కిరణమంత వేగంతో ఉంటుంది. ఇందులో ఉంటుంది ప్రేమ. ప్రేమలోనే దాని క్రమశిక్షణ ఉంటుంది. దీని లోని సౌందర్యం కవాతు చేయించి, ఒక మూసలో రూపుదిద్ది అదుపులో ఉంచి, చిత్ర హింసలకు లోను చేసిన మనసుకు అందకుండా పోతుంది. ఇటువంటి క్రమశిక్షణ లేకుండా మనసు ముందుకు ప్రయాణించలేదు.

**('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి)**

■

# స్వంతం అని భావిస్తే ప్రేమనశిస్తుంది

అతడు తనతో పాటు భార్యను కూడా తీసుకొచ్చాడు. ఎందుకంటే ఇది మా ఇద్దరికీ సంబంధించిన సమస్య కదా అని అన్నాడు. ఆమె కళ్ళు చురుగ్గా మెరుస్తున్నాయి. చిన్న ఆకారం; ఉత్సాహం ఉన్నది కానీ కొంత అలజడి చెంది ఉన్నట్లుగా కూడా కనబడింది. వాళ్ళు చాలా సాదాసీదాగా స్నేహభావం ఉట్టిపడుతూ ఉన్నారు. అతడు ఇంగ్లీషు బాగానే మాట్లాడుతున్నాడు. ఆమెకి అంతగా రాదు. అయితే అర్థం చేసుకోగలుగుతున్నది. చిన్న చిన్న ప్రశ్నలు వేయగలుగుతున్నది. కష్టంగా తోచినప్పుడు భర్త వైపు తిరగి చూస్తుంది. అతడు వాళ్ళ భాషలో వివరంగా చెప్తున్నాడు. వారి వివాహం అయి 25 సం॥ల పైగా అయిందనీ, పిల్లలు చాలా మంది ఉన్నారనీ అన్నాడు. సమస్య పిల్లలతో కాదుట. వీరిద్దరి మధ్య జరుగుతున్న పోరే సమస్యట. తనకి ఒక ఉద్యోగం ఉన్నదనీ, ఆదాయం ఒక మాదిరిగా సరే పోతున్నదనీ అంటూ, ఈ ప్రపంచంలో ప్రశాంతంగా బ్రతకడం చాలా కష్టసాధ్యమై పోయిందని అన్నాడు. ముఖ్యంగా వివాహితులకు మరీ కష్టం అన్నాడు. ఊరికే విషయం చెప్తున్నానే

తప్పు అసంతృప్తితో చేసే సణుగుడు కాదని కూడా అన్నాడు. భర్త చేయవలసిన విధులన్నీ చేశాననే అనుకుంటున్నాననీ, దీని కోసం చాలా శ్రమ పడ్డానని అన్నాడు.

అసలు అంశానికి రావడం వారికి అంత త్వరగా సాధ్యమవలేదు. కొంత సేపు రకరకాల విషయాల్ని గురించి మాట్లాడారు. పిల్లల చదువులు, అమ్మాయిల వివాహాలు, శుభకార్యాలలో జరిగే వృథా ఖర్చులు, ఈ మధ్య కుటుంబంలో సంభవించిన ఒకరి మరణం, ఇంకా ఎన్నో అవీ ఇవీ ప్రస్తావించారు. వాళ్ళు తీరిగ్గా, హాయిగా కూర్చున్నారు. ఎవరైనా వినేవారుంటే, ముఖ్యంగా ఎదుటి వారు అర్థం చేసుకోగలరేమో అనే ఆశ ఉన్నప్పుడు 'మాట్లాడటం ఎంతో బాగుంటుంది.

మరొకరి కష్టాలను గురించి వినడానికి ఎవరికి అంత శ్రద్ధ ఉంటుంది? మన స్వంత సమస్యలే మనకి బోలెడు ఉంటాయి. ఇక ఇతరుల సమస్యలకి మన వద్ద సమయం ఉండదు. మరొకరు మనం చెప్పేది వినాలంటే వారికి డబ్బో, ప్రార్థనో, నమ్మకమో ఏదో ఒక ముడుపు చెల్లించుకోవాలి. ఆ వృత్తిలో ఉన్నవారు వింటారు. అది వారి ఉద్యోగం కాబట్టి. అయితే అందులో శాశ్వతమైన నిర్వృతి లభించదు. మన లోపలి భారాన్ని స్వేచ్ఛగా, అప్పటి కప్పుడు నిరాఘాటంగా దించేసుకోవాలనీ, తరువాత అయ్యో అంటూ విచారించకుండా వుండాలనీ మనం అనుకుంటాం. అంతర్గతంలో ఉన్నదంతా ఒకరికి చెప్పుకోవడంలో గల స్వచ్ఛత, నిర్మలత్వం వినే వారి మీద ఆధారపడి ఉండదు. ఎవరైతే తమ హృదయం విప్పి చూపాలనుకుంటారో వారి పైనే ఉంటుంది. ముఖ్యమైనది ఏమిటంటే మన హృదయం విప్పడం, తెరచి చూపడం. వినడానికి ఎవరో ఒకరు దొరుకుతారు. కనీసం ఒక బిచ్చగాడు. అతడికే హృదయం తనను వెళ్ళ బోసుకుంటుంది. తనలో తాను అంతర్ విశ్లేషణ చేసుకోవడం వలన హృదయం ఎన్నడూ తెరచుకోదు. ఇది తన చుట్టూ ఒకదడి కట్టుకొని దిగులుతో క్రుంగిపో జేస్తుంది. బొత్తిగా నిరర్థకమైన పని.

హృదయం తెరవడం అంటే. వినడం. మీ లోపల ఉన్న దానిని వినడమే కాకుండా, మీ చుట్టూ ఉన్న ప్రతి ఒక్క ప్రభావాన్ని, ప్రతిఒక్క కదలికను వినడం. మీరు విన్న దానిని గురించి ప్రత్యక్ష రూపంలో ఏదైనా చేయడం సాధ్యం అవచ్చు, కాకపోవచ్చు. కానీ అసలు తెరచుకొని వివృతంగా ఉండటం అనే ఆ అంశమే అది తీసుకునే చర్య అవుతుంది. ఇటువంటి వినడం మీ హృదయాన్ని స్వచ్ఛపరుస్తుంది. మనసు జొరబెట్టిన విషయాలను తొలగించి ప్రక్షాళనం చేస్తుంది. మనసుతో వినడం అంటే కాలక్షేపం కబుర్ల వంటిది. దీని వలన మీకు గాని ఇతరులకుగాని ఏ విడుదలా లభిచదు. ఇది పైగా బాధను కొనసాగించడమే అవుతుంది. ఇది వట్టి మూర్ఖత్వం.

ఎంతో తీరిగ్గా మాట్లాడాక వాళ్ళు అసలు విషయం వద్దకు వచ్చారు.

"మా సమస్యను గురించి మాట్లాడాలని మీ వద్దకు వచ్చాం. మాలో అసూయ ఉన్నది. నాకు లేదు గాని ఆమెలో అసూయ ఉన్నది. ఇప్పటిలా తన అసూయను ఇంతకు ముందు ఎప్పుడూ బయట పెట్టలేదు గానీ, రవ్వంత అసూయ ఆమెలో ఎప్పుడూ ఉండేది. ఆమెలో అసూయ కలగడానికి కారణం నా ప్రవర్తనలో ఏదీ లేదనే అనుకుంటున్నాను. కానీ ఆమె మాత్రం నాలో ఏదో ఒక కారణం పట్టుకుంటుంది."

అసూయ కలగడానికి ఏదైనా కారణం ఉంటుందని మీరనుకుంటున్నారా? అసూయ కలగడానికి వెనుక మూలహేతువు వంటిదేదైనా ఉంటుందా? ఆ హేతువు తెలుసుకుంటే అసూయ మాయమవుతుందా? కారణం తెలుసుకున్నాక కూడా అసూయ ఇంకా కొనసాగడం మీరు గమనించే ఉంటారు కదూ? కారణం కోసం మనం వెతకద్దు. అసూయనే అర్థం చేసుకుందాం. మీరు చెప్పినట్లుగా ఏదో ఒక అంశాన్ని, అది ఏదైనా సరే పట్టుకొని ఈర్ష్య పడవచ్చు. అర్థంచేసుకోవలసినది ఈర్ష్యను. దేని వలన అది కలిగింది అనే దానిని కాదు.

*(తక్కినది వచ్చే సంచికలో)*

(తక్కినది వచ్చే సంచికలో)

**మీ చిరునామా తెలిపితే పత్రిక ఉచితంగా పంపుతాము**


**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM-IV**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar,<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months<br>(August, December & April) |
| 3. Printer's Name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press<br>27, Neelakanta Metha Street<br>T. Nagar<br>Chennai - 600 017. |
| 4. Publishers Name | : | G. Rajeev |
| Whether citizen of India | : | Yes |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124,126 Greenways Road<br>Chennai - 600 028. |
| 5. Editors Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |
| 6. Name and address of the individuals who own the newspaper and partners of shareholders holding more than one percent of the total capital. | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028 |

I, G. Rajeev hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

Sd.
(G. Rajeev)

*Published in August, December & April* Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*



*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org



*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*